సాక్షి హనుమకొండ

శుక్రవారం । 4 । ఆగస్టు । 2023



పసుపు.. పరుగు

పచ్చ బంగారం ధర పరుగులు పెడుతోంది. పసుపునకు రికార్డు స్థాయిలో గరిష్ట ధర క్వింటాకు రూ.12 వేలకు పైగా పలుకుతోంది.

- 8లో ▸



పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఇస్రో మాజీ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ అపూర్బ కంజిలాల్ అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
$33^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

స్టైఫండ్ పెంచాలని హౌస్ సర్జన్ల నిరసన



కాశిబుగ్గ: స్టైఫండ్ పెంచాలని వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాల ఎదుట శాంతియుత నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని మిగతా రాష్ట్రాల్లో హౌస్ సర్జన్లకు నెలకు రూ.25వేలు ఇస్తుండగా తెలంగాణలో మాత్రం రూ.10,500 ఇస్తున్నారన్నారు. ప్రతి రెండేళ్లకు స్టైఫండ్ పెంచాల్సి ఉండగా ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా పెంచకుండా కాలయాపన చేస్తోందన్నారు. ఇచ్చేది సరిపోక వైద్య విద్యనభ్యసించే హౌస్‌సర్జన్లు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. నిరసనలో హౌస్ సర్జన్లు, ఫైనలియర్ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

రుణమాఫీపై సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు



హన్మకొండ: రైతుల రుణమాఫీ చేసిన సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు దాస్యం వినయ్‌భాస్కర్, అరూరి రమేష్‌లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. రైతులకు అండగా నిలుస్తూ రుణమాఫీ చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

వీఆర్‌ఏల సర్దుబాటుకు కసరత్తు



హన్మకొండ అర్బన్: ప్రభుత్వం వీఆర్‌ఏలను ఇతర శాఖల్లో సర్దుబాటు, విద్యార్హతలను బట్టి పదోన్నతులు ఇస్తున్న నేపథ్యంలో జిల్లాలో కసరత్తు వేగంగా సాగుతోంది. 14మండలాల్లో ఉన్న 141మంది వీఆర్‌ఏల ఎస్‌ఆర్ వివరాలు, ఇతర వ్యక్తిగత సమాచారం సేకరిస్తున్నారు. 61సంవత్సరాల వయస్సు పూర్తయిన వారి వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించడంతో ఆ కేటగిరీలో సుమారు 108 వరకు దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. వారి అర్హతలను బట్టి కలెక్టర్ పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు. వీఆర్‌ఏలకు సంబంధించి సమాచారం నిర్దిష్ట నమూనాలో తీసుకుంటున్నారు.

దివ్యాంగులకు లైసెన్స్‌లు ఇవ్వాలి



ఖిలా వరంగల్ : త్రిచక్ర వాహనాల మాదిరిగానే 2, 4 వీలర్స్ నడిపే దివ్యాంగులకు లైసెన్స్‌లను జారీ చేయాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అజీం, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బండి చక్రపాణి, అంబటి రాజేందర్ కోరారు. ఈమేరకు గురువారం వరంగల్ జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఆర్టీఓ ఆఫ్రీన్‌సిద్ధిఖీని వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలకు లైసెన్స్‌లు జారీ చేస్తున్నారని, ఇదే తరహాలో 2, 4 వీలర్స్ నడిపే దివ్యాంగులకు అర్హత పరీక్షలు నిర్వహించి డ్రైవింగ్ లైసెన్స్‌లు జారీ చేయాలని కోరారు. ఇందుకోసం ఆర్టీఓ సానుకూలంగా స్పందించారని, ఉన్నతాధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐ రవీందర్, దివ్యాంగులు గై సతీష్, బత్తిని రాజు, అబ్దుల్ షబ్బీర్, ఎండీసాదిక్, అసద్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓగా రాంరెడ్డి

వరంగల్ : వరంగల్ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా జి.రాంరెడ్డి నియమితులయ్యారు. జనగామ డీఆర్‌డీఓగా పనిచేస్తున్న ఆయనను వరంగల్ జెడ్పీ సీఈఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సుమారు ఏడాదిన్నరగా ఖాళీగా ఉన్న సీఈఓ పోస్టును ప్రభుత్వ భర్తీ చేసింది.

ఆ బ్రిడ్జి నిర్మిస్తే...

పలు కాలనీలకు ముంపు తప్పేది

- తక్కువ సామర్థ్యం కలిగిన నయీంనగర్ పురాతన వంతెన
- వరద సులువుగా వెళ్లక కాలనీలను ముంచెత్తిన వైనం
- నయీంనగర్ వంతెనకు రూ.15 కోట్లు, రాజాజీనగర్ వంతెనకు రూ.9 కోట్లు మంజూరు
- టెండర్ దక్కించుకుని పనులు మొదలు పెట్టని కాంట్రాక్టర్లు
- పట్టింపులేని నగర పాలక సంస్థ ఇంజనీర్లు



నయీంనగర్ నాలాపై ప్రధాన రహదారి అడుగున నిర్మించిన పురాతన వంతెన



ముంపునకు గురైన ఇంజనీర్స్ కాలనీ (ఫైల్)



ముంపునకు గురైన కిషన్ పుర (ఫైల్)

హన్మకొండ: హనుమకొండలోని నయీంనగర్ పెద్ద మోరీ (నాలా)పై వంతెన నిర్మిస్తే ఇటీవల కురిసిన వరదలకు పలు కాలనీలకు ముంపు తప్పేదని పరిశీలకులు, నగరవాసులు చెబుతున్నారు. నయీంనగర్ మోరీపై వంతెనను పురాతనకాలంలో చిన్న గూనపైపులతో చిన్నగా నిర్మించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వచ్చే వరద ఈ వంతెనపైనుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి. వరదకు కొట్టుకు వచ్చిన చెత్త, ఇతర వ్యర్థాలు చిన్న పైపుల్లో చిక్కుకుని వరదను వెనక్కి నెట్టింది. దీంతో ఎగువనున్న కాలనీలు జలమయమయ్యాయి. తక్కువ వరద సామర్థ్యం ఉన్న ఈ వంతెనకు పరిష్కారమార్గంగా, వరద సులువుగా దిగువకు వెళ్లేలా కొత్త (నయీంనగర్) వంతెన నిర్మాణానికి బల్దియా నిర్ణయించింది. స్మార్ట్ సిటీ నిధులనుంచి రూ.15 కోట్లు మంజూరు చేసింది. అదే విధంగా ఇదే నాలాపై ఎగువన రాజాజీనగర్ వద్ద ఉన్న చిన్న వంతెనను సైతం పెద్దగా నిర్మించేందుకు మరో రూ.9 కోట్లు మంజూరు చేశారు. వీటి పనులకు ఏడాదిన్నర క్రితం వరంగల్‌కు కేటీఆర్ వచ్చిన సందర్భంలో శంకుస్థాపన చేశారు. దీంతోపాటు ఇంజనీర్స్ కాలనీ దిగువనుంచి నయీంనగర్ వరకు నాలాకు ఇరువైపులా రిటిట్‌వాల్ నిర్మించేందుకు రూ.28 కోట్లు మంజూరు చేసింది. రిటిట్‌వాల్ పనులు 25 శాతం వరకు జరిగాయి. కానీ, నయీంనగర్, రాజాజీనగర్ వద్ద వంతెనల నిర్మాణ టెండర్ ద్వారా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు అసలు పనులు మొదలు పెట్టలేదు.

నిర్లక్ష్యంతోనే.. కాలనీల ముంపు

భారీ వర్షాలు వస్తే ముంపు తప్పదని తెలిసినా జాతీయ రహదారుల శాఖ, నగర పాలక సంస్థ ఇంజనీర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించిన మూలంగానే నయీంనగర్ వంతెన నుంచి వరద బయటకు వెళ్లలేక వెనక్కినెట్టింది. దీంతో హనుమకొండలోని ఇంజనీర్స్ కాలనీ, గోకుల్‌నగర్, విద్యానగర్, రాంనగర్, క్రాంతి నగర్, నందితారే నగర్, రాజాజీ నగర్, కిషన్‌పుర, నెహ్రూనగర్‌తో పాటు నయీంనగర్ ప్రధాన రహదారి ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. వంతెన నిర్మించి ఉంటే దిగువకు వరద నీరు సులువుగా వెళ్లేదని, దీంతో ఈ కాలనీలకు ముంపు తప్పేదని నిపుణులు, నగర వాసులు తెలిపారు. బల్దియా, జిల్లా అధికార యంత్రాంగం కళ్లుతెరిచి వంతెనల నిర్మాణాన్ని చేపట్టి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వంతెన నిర్మించకపోవడంతోనే ముప్పు



నయీంనగర్ నాలాపై వంతెన నిర్మించకపోవడంతో ముప్పు వాటిల్లింది. ప్రస్తుతమున్న వంతెన చిన్నదిగా ఉండడం.. భారీ వరద పోటెత్తడంతో చిన్న తూముల్లోంచి వెళ్లలేక బ్యాక్ వాటర్ వెళ్లి కాలనీలు ముంపునకు గురయ్యాయి. సకాలంలో వంతెన నిర్మిస్తే 10 కాలనీలు, నయీంనగర్ ప్రధాన రహదారికి ముంపు ముప్పు తప్పేది.

- శీలం ప్రవీణ్ కుమార్, నెహ్రూనగర్

సర్వస్వం కోల్పోయాం...



నయీంనగర్ నాలా ఉప్పొంగి రోడ్డు ఎత్తు వరకు పెరగడంతో వరద వెనక్కు వచ్చి కాలనీని ముంచెత్తింది. ఇంట్లోని వస్తువులన్నీ పాడయ్యాయి. కట్టుబట్టలు మినహా ఏమీ మిగలలేదు. నిత్యావసరాలన్నీ పాడయ్యాయి. అన్ని కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్నాం.

- జిల్లపెల్లి కవిత, రాజాజీనగర్

వంతెన పనులు త్వరగా చేపట్టాలి



నయీంనగర్ నాలాపై మంజూరైన వంతెనను జాతీయ రహదారుల శాఖ, రాజాజీనగర్ వద్ద మంజూరైన వంతెనను మహానగర పాలక సంస్థ త్వరగా నిర్మాణ పనులు చేపట్టాలి. మంజూరైన నాటినుంచి పనులు మొదలు పెడితే నిర్మాణం పూర్తయ్యేది. ఇప్పుడు ముంపు తప్పేది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి పనులు మొదలు పెట్టేలా చర్యలు తీసుకోవాలి.

- చాడా స్వాతి, కార్పొరేటర్

టెండర్లకు వేళాయె..

నేటినుంచి మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

- కలెక్టరేట్‌లోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఏర్పాట్లు
- సింగిల్ ఫేజ్ అప్లికేషన్.. రిజర్వేషన్‌లకు లక్కీడ్రా
- రిజర్వేషన్ల వారీగా డ్రా తీసిన కలెక్టర్ సిక్తా పట్నాయక్



లక్కీ డ్రా ద్వారా రిజర్వేషన్లను కేటాయిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

కాజీపేట అర్బన్/ హన్మకొండ అర్బన్ : వరంగల్ అర్బన్‌లోని 65 వైన్‌షాపులను రెండేళ్ల కాల వ్యవధితో దక్కించుకునేందుకు ఎక్సైజ్ శాఖ శుక్రవారం నుంచి దరఖాస్తులు స్వీకరించనుంది. హనుమకొండ జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని వరంగల్ అర్బన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఉదయం 11నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. ఇందుకు గాను ఎక్సైజ్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

సింగిల్ ఫేజ్ అప్లికేషన్.. దరఖాస్తు ఇలా..

2021–23 ఎక్సైజ్‌పాలసీని 2023 –25 సంవత్సరానికి కూడా కొనసాగిస్తున్నారు. దరఖాస్తుతోపాటు దరఖాస్తుదారుల ఆధార్‌కార్డు, పాన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతోపాటు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి పేరిట తీసిన డీడీ లేదా చలాన్‌ను అందజేయాలి. దరఖాస్తుకు సింగిల్ ఫేజ్ అప్లికేషన్ ఏర్పాటు చేశారు. వ్యక్తిగత వివరాలతోపాటు ఆధార్, పాన్‌కార్డు వివరాలు, బ్యాంక్ డీడీ లేదా చలాన్ వివరాలు అందించాలి.

ఎక్కడైనా...

వైన్స్ టెండర్లలో పాల్గొనేందుకు ఉమ్మడి వరంగల్ పరిధిలోని ఏ జిల్లాలోనైనా, ఎన్ని దరఖాస్తులైనా చేసుకునే అవకాశం కల్పించారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కడ తీసిన డీడీ, చాలాన్‌ను అయినా వారికి అనుకూలమైన జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో అందజేయవచ్చు.

రిజర్వేషన్ల వారీగా మద్యం దుకాణాల కేటాయింపు

వరంగల్ అర్బన్ (హనుమకొండ) జిల్లాకు సంబంధించిన రిటైల్ మద్యం దుకాణాలను ఎస్టీ, ఎస్సీ, గౌడలకు రిజర్వేషన్ ఆధారంగా లాటరీ ద్వారా కేటాయించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ఎక్సైజ్, గిరిజన సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమశాఖ, బీసీ అభివృద్ధి అధికారుల సమక్షంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్ డ్రా ద్వారా షాపులను కేటాయించారు. మొత్తం 65 రిటైల్ మద్యం షాపులకుగాను ఎస్టీలకు 01, ఎస్సీ 10, గౌడలకు 15 మద్యం షాపులను కేటాయించారు. మిగిలిన 39 మద్యం షాపులు జనరల్ కేటగిరి కిందికి రానున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జి.అంజన్ రావు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఎస్సీ, బీసీ, ఎస్టీ సంక్షేమశాఖల జిల్లా అధికారులు రాంరెడ్డి, ప్రేమకళ, నిర్మల పాల్గొన్నారు.

అన్వేషణలే ఆవిష్కరణలకు నాంది

డీఈఓ ఎండీ అబ్దుల్‌హై



మాట్లాడుతున్న డీఈఓ ఎండీ అబ్దుల్‌హై

విద్యారణ్యపురి: విద్యార్థులు నిత్యజీవితంలో ఎదుర్కొనే సమస్యలపై అనుభూతి చెంది వాటి పరిష్కారానికి అన్వేషణలే ఆవిష్కరణలకు నాంది అని హనుమకొండ జిల్లా డీఈఓ ఎండీ అబ్దుల్‌హై అన్నారు. కేంద్రశాస్త్ర సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ మనాక్ అవార్డులకు నమోదు చేయించాలని సైన్స్ ఉపాధ్యాయులను కోరారు. గురువారం హనుమకొండ జిల్లాలోని అన్ని యాజమాన్యాల హైస్కూల్ ఉపాధ్యాయులకు కాజీపేటలోని ఫాతిమానగర్‌లోని సేయింట్ గాబ్రియల్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో నిర్వహించిన ఓరియెంటేషన్ కార్యక్రమంలో డీఈఓ పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలన్నారు. ఈ ఏడాది మే 1 నుంచి ప్రారంభమైన ఇన్‌స్పైర్ మనాక్ అవార్డుల నమోదు ప్రక్రియకు ఈ నెల 31వరకు గడువు ఉందన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలనుంచి విద్యార్థులను నమోదు చేయించాలని కోరారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు భీమదేవరపల్లి, దామెర, హనుమకొండ, హసన్‌పర్తి, ఐనవోలు, కాజీపేట మండలాల ఉపాధ్యాయులకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆత్మకూరు, ధర్మసాగర్, ఎల్కతుర్తి, కమలాపూర్, శాయంపేట, నడికుడ, పరకాల, వేలేరు మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసస్వామి, హెచ్‌ఎం సుమాదేవి పాల్గొన్నారు. రిసోర్స్‌పర్సన్‌లుగా జిల్లా క్వాలిటీ కోర్డినేటర్ శ్రీనివాస్, కె.వాసు, ఆనందం, ఎ.జ్ఞానేశ్వర్, డి.రమేష్, ఎ. సంపతి వ్యవహరించారు. ఇన్‌స్పైర్ నమోదు, లాగిన్ అవడం, మెయిల్, బడి మార్పు తదితర అంశాలను వివరించారు. ఎటువంటి అంశాలపై ప్రాజెక్టులు రూపొందించాలో సూచనలు, సలహాలు ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రాజకొమురయ్య (ఫైల్)

దామెర: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రం సమీపంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శాయంపేట మండలం మాందారిపేటకు చెందిన అల్లం రాజకొమురయ్య (55) కాంట్రాక్ట్ పనులు చేసుకుంటూ హనుమకొండలో నివాసం ఉంటున్నాడు. స్వగ్రామంలో పనులు ముగించుకొని తన ద్విచక్ర వాహనంపై హనుమకొండకు తిరిగి వెళుతున్నాడు. ఈ క్రమంలో దామెర మండల కేంద్రం సమీపంలోని శ్రీహర్ష పాఠశాల వద్దకు రాగానే జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి ఎగిరి కిందపడ్డాడు. దీంతో రాజకొమురయ్య తలకు కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు.

హెల్మెట్ ఉంటే ప్రాణాలు దక్కేవి

రాజకొమురయ్య ద్విచక్రవాహనం పైనుంచి కింద పడడంతో తల రోడ్డుకు బలంగా గుద్దుకోవడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. తలకు హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలు దక్కేవని సంఘటనాస్థలాన్ని చూసిన గ్రామస్తులు తెలిపారు.

తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

- జిల్లాలో 14మందికి ఉత్తర్వులు
- కలెక్టరేట్ ఏఓగా సత్యనారాయణ.. పోస్టుల కోసం తీవ్ర ఒత్తిళ్లు

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లాకు ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన తహసీల్దార్లకు కలెక్టర్ సిక్తా పట్నాయక్ పోస్టింగ్‌లు ఇస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరితోపాటు కలెక్టరేట్‌లో ఉన్నవారికి స్థానచలనం కల్పించారు. పోస్టింగ్‌ల విషయంలో జిల్లా ఉన్నతాధికారులకు చివరి నిమిషం వరకు తీవ్రస్థాయిలో ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిళ్లు వచ్చినట్లు సమాచారం. త్వరలో ఎన్నికలు ఉన్న నేపథ్యంలో తీవ్ర ఒత్తిడి ఉన్నప్పటికీ సీనియారిటీ, పనితీరు ఆధారంగా కొందరి పోస్టులు చివరి నిమిషంలో మార్పులు జరిగినట్లు సమాచారం. ఊహించినదానికంటే భిన్నంగా పోస్టింగ్‌లు ఉండటంతో కొందరు అసంతృప్తి వ్యక్తం చేయగా ఉన్నతాధికారులు సర్దిచెప్పినట్లు తెలిసింది. పోస్టింగ్‌లు పొందిన వారిలో ఐ.బావుసింగ్ (కాజీపేట), జి.సదానందం (ధర్మసాగర్), చల్ల ప్రసాద్ (హసన్‌పర్తి), కె.విజయ్‌కుమార్ (హనుమకొండ), ఏవీఎస్ ప్రసాద్ (కలెక్టరేట్ సూపరింటెండెంట్), హెచ్.కోమి (వేలేరు), కె.సత్యనారాయణ (కలెక్టరేట్ ఏఓ), జి.నాగరాజు (నడికూడ), డీఎస్ వెంకన్న (శాయంపేట), జె.సుభాషిణి (ఐనవోలు), ఎ.జగత్‌సింగ్ (ఎల్కతుర్తి), పి.మాధవి(కమలాపూర్), మంద జ్యోతివరలక్ష్మిదేవి(దామెర), ఏ.వెంకటభాస్కర్ (భీమదేవరపల్లి) ఉన్నారు.

మానవత్వం చాటుకున్న ఆటోడ్రైవర్




శ్రీనివాస్‌కు డబ్బుల బ్యాగు అందజేస్తున్న ఆటోడ్రైవర్ రాజు

కమలాపూర్: కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన ఆటోడ్రైవర్ పెండెం రాజు తనకు దొరికిన డబ్బుల బ్యాగును నిజాయితీగా బాధితుడికి అందజేశాడు. మండలంలోని ఉప్పులపల్లికి చెందిన అమరగొండ శ్రీనివాస్ గురువారం తన పిల్లల ఫీజు చెల్లించడానికి ద్విచక్ర వాహనంపై ఎర్రగట్టుకు వెళ్తుండగా కమలాపూర్ బస్టాండ్ వద్ద బ్యాగ్ పడిపోయింది. అందులో రూ.20 వేలు ఉన్నాయి. ఆ బ్యాగు ఆటోడ్రైవర్ పెండెం రాజుకు దొరకగా వివరాలు ఆరా తీసి శ్రీనివాస్‌కు సమాచారం ఇచ్చాడు. అనంతరం కమలాపూర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్ సమక్షంలో శ్రీనివాస్‌కు అందజేశాడు. నిజాయితీగా డబ్బుల బ్యాగును అందజేసిన రాజును, సహకరించిన బ్లూ కోట్ సిబ్బంది సురేష్, సురేందర్‌లను ఇన్‌స్పెక్టర్ సంజీవ్ అభినందించారు.

స్మార్ట్‌గా ఆలోచించండి.. చోరీలకు చెక్ పెట్టండి

వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం: స్మార్ట్ ఆలోచన విధానంతో పోలీసులు చోరీలను నియంత్రించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత చోరీలకు సంబంధించిన పెండింగ్ కేసులపై సీపీ రంగనాథ్ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలో మూడేళ్లకాలంలో నమోదైన చోరీకేసులు, నిందితుల అరెస్టు, స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు, కేసుల పెండింగ్‌కు గల కారణాలపై జోన్ల వారీగా ఆరా తీశారు. ముఖ్యంగా ద్విచక్రవాహనాల చోరీలు, ఇళ్లల్లో చోరీలు, దోపిడీలు, సాధారణ దొంగతనాల నివారణకు అధికారులు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాల చోరీలపై అధికారులు శ్రద్ధ పెట్టాలన్నారు. కొంత కాలంగా ట్రైసిటీ పరిధిలో ఇటువంటి చోరీలు అధికమయ్యాయని, పాత దొంగల సమాచారాన్ని సేకరించాలన్నారు. దీనితోపాటు చోరీ వాహనాలు కొనుగోలు చేసే వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. రాత్రి పెట్రోలింగ్‌తోపాటు, వాహన తనిఖీలు నిర్వహించాలని సూచించారు. గతంలో చోరీలకు పాల్పడిన నిందితుల సమాచారం సేకరించడంతోపాటు వారి ప్రస్తుత స్థితిగతులపై ఆరా తీసేందుకు ఏసీపీ రమేష్‌కుమార్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. సమావేశంలో క్రైం డీసీపీ మురళీధర్, డీసీపీలు రవీందర్, ఎంఎ బారీ, సీతారాం, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

మంచి ఆహారపు అలవాట్లతోనే ఆరోగ్యం

హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్



మాత్రలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

విద్యారణ్యపురి: విద్యార్థులు మంచి అలవాట్లు అలవర్చుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యంగా ఉంటారని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండలోని లష్కర్‌బజార్ బాలికల ఉన్నతపాఠశాలలో జాతీయ నులిపురుగుల దినోత్సవం కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. నులిపురుగుల వల్ల పిల్లల్లో ఆరోగ్య సమస్యలు వస్తాయని, దీని ప్రభావం చదువుపై పడుతుందన్నారు. దీనిని దృష్టిలోపెట్టుకుని నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని దేశమంతా నిర్వహిస్తున్నారన్నారు. దీంతో సత్ఫలితాలు వస్తున్నాయన్నారు. పిల్లల్లో రక్తహీనత లోప నివారణ, పోషకాహార లోపం, ఎదుగుదల లోపం, ఏకాగ్రత వంటి లోపాలు తగ్గుముఖం పట్టాయన్నారు. జిల్లాలో 2,33,500మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వనున్నట్లు తెలిపారు. డీఎంహెచ్‌ఓ సాంబశివరావు మాట్లాడుతూ మొదటిరోజు మాత్రలు వేసుకోని వారికి 10వ తేదీన మ్యాప్ ఆఫ్‌రౌండ్‌లో వేస్తారని తెలిపారు. కార్పొరేటర్ చెన్నం మధు, జిల్లా సంక్షేమ అధికారి మధురిమ, డీఐఒ డాక్టర్ గీతాలక్ష్మి, హెచ్‌ఎం శైలజ, అశోక్‌రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ తేజస్విని పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సహించాలి

కరీమాబాద్: ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటలను పెంచేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. శనివారం వరకు లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలని ఎంపీడీఓలకు సూచించారు. అడిషనల్ కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీ, వ్యవసాయ, ఉద్యాన శాఖకు చెందిన వ్యవసాయ విస్తరణ అధికారులు, వ్యవసాయ సంచాలకులు, ఎంపీడీఓలతో గురువారం కలెక్టర్ గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు బీమా దరఖాస్తుకు ఈనెల 5 చివరి తేదీ అని తెలిపారు. ఈ పాస్ మిషన్ ద్వారా మాత్రమే ఎరువుల అమ్మకాలు జరిగేలా చూడాలని, అమ్మకాల క్లియరెన్స్ ఎప్పటికప్పుడు చేసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు.

తడిసిన వీణ, వయోలిన్ వాయిద్యాలు







వాయిద్యం మోగేదెలా?

- నీటమునిగిన సంగీత పరికరాలు

వరంగల్ పోతన నగర్‌లోని విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల గతవారం కురిసిన అతిభారీ వర్షాల వల్ల నీట మునిగిన విషయం తెలిసిందే. తరగతి గదుల్లోని కార్పెట్లు, ఫర్నిచర్, కంప్యూటర్, మైక్‌సెట్లు, స్పీకర్లు, విద్యుత్ సిరీస్‌లైట్లు, విలువైన సీతార్లు, తబలాలు, డోలక్, వయోలిన్, వీణ తదితర సంగీత వాయిద్యాలు నీటమునిగి ఉపయోగం లేకుండాపోయాయి. సుమారు రూ.15లక్షల నష్టం వాటిల్లిందని అంచనా వేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్ తెలిపారు.

- హన్మకొండ కల్చరల్

రుణమాఫీ.. అన్నదాత హ్యాపీ

- వరంగల్ డీసీసీబీలో మొత్తం రుణమాఫీ రూ.283.97 కోట్లు
- మొదటి విడతలో జరిగిన మాఫీ రూ.6.49 కోట్లు
- రెండో విడతలో రూ.16.50 కోట్లు..

హన్మకొండ : రాష్ట్ర ప్రభుత్వం 2018లో ప్రకటించిన రుణమాఫీ పథకం కింద వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)కి పరిధిలోని 70 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా మొత్తం 66,400 మంది రైతులు రూ.283.97 కోట్ల మేర రుణమాఫీ ద్వారా లబ్ధి పొందుతున్నారు. అయితే ప్రభుత్వం ఇప్పటి వరకు రెండు విడతల్లో రుణమాఫీ చేసింది. మొదటి విడతలో రూ.25 వేల లోపు రుణమాఫీ చేసింది. రెండు విడతలో రూ.50 వేల లోపు రుణాలు మాఫీ చేసింది. ఆ తర్వాత రుణమాఫీ నిలిచిపోయింది. ప్రస్తుతం ఎన్నికలు సమీపించిన తరుణంలో ప్రభుత్వం రూ.లక్ష లోపు రుణమాఫీ చేయాలని, ఈ నెల 3 నుంచి సెప్టెంబర్ 17లోపు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇన్ని రోజులు రుణమాఫీ అవుతుందో లేదోననే నిరాశ ఉన్న రైతుల్లో ఒక్కసారిగా సంతోషం నెలకొంది. వరంగల్ డీసీసీబీలో ఇప్పటి వరకు రూ.25 వేలలోపు రుణాలు మొదటి విడత కింద 11,430 మంది రైతులకు రూ 6.49 కోట్ల రుణమాఫీ జరిగింది. రూ.50 వేలలోపు రుణాలు రెండో విడత కింద 4462 మంది రైతులు రూ.16.50 కోట్లు లబ్ధి పొందారు. ఇప్పటివరకు రెండు విడతలలో కలిపి 15892 మంది రైతులకు రూ.23.01 కోట్లు రుణమాఫీ జరిగింది. డీసీసీబీ ప్రభుత్వానికి సమర్పించిన రుణ మాఫీ మొత్తంలో రెండు విడతలలో విడుదలైన రుణమాఫీ పోను ఇంకా 27542 మంది రైతులకుగాను రూ.220.96 కోట్లు రుణమాఫీ జరుగాల్సి ఉంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వీరంత రుణ విముక్తులు కానున్నారు.

నేటినుంచి సాహిత్యోత్సవాలు..

- నాలుగు రోజుల పాటు నిర్వహణ
- పలు గ్రంథాల ఆవిష్కరణ, సాహితీవేత్తల ప్రసంగాలు

హన్మకొండ కల్చరల్ : వరంగల్ సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 7వ తేదీ వరకు సాహిత్యోత్సవాలు నిర్వహిస్తున్నామని సహృదయ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు గన్నమరాజు గిరిజామనోహరబాబు, కుందావజ్ఝల కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ వడ్డేపల్లిరోడ్ మండల కార్యాలయం పక్కన ఉన్న పీఆర్ రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో రోజూ సాయంత్రం 6గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే కార్యక్రమాలలో భాగంగా మొదటిరోజు హైదరాబాద్ తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ముఖ్యఅతిథిగా, విశిష్ట అతిథులుగా పరిషత్ కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య , ప్రముఖ వైద్యుడు సురవరం కృష్ణవర్ధన్ పాల్గొని దివంగత సురవరం ప్రతాపరెడ్డి రచించిన హైందవ ధర్మవీరులు గ్రంథావిష్కరణ చేస్తారు. 5న శనివారం రిటైర్డ్ దేవాదాయధర్మాదాయ శాఖ కమిషనర్ నందివెలుగు ముక్తేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై దివంగత రాళ్లబండి కవితాప్రసాద్ స్మారకంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ఐజీపీ, రచయిత రావులపాటి సీతారామ రావుకు సహృదయానుబంధ పురస్కారం అందజేయనున్నారు. 6న దివంగత ధరిపల్లి వెంకట నరసింహాచార్య రచించిన పురాణవైర గ్రంథమాల – జ్ఞాన విజ్ఞానం గ్రంథావిష్కరణ జరుగనుంది. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆచార్యుడు సాగి కమలాకర శర్మ ముఖ్యఅతిథిగా, కరీంనగర్‌కు చెందిన అష్టావధాని డాక్టర్ గంద్ర లక్ష్మణరావు, ధరిపల్లి రఘురామ్ విశిష్ట అతిథులుగా పాల్గొంటారు. చివరి రోజు 7న కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ ముఖ్యఅతిథిగా, సాహితీవేత్త గంటా రామిరెడ్డి, మాధవి, రాధిక విశిష్టఅతిథులుగా హాజరై దివంగత వే. నరసింహారెడ్డి రచించిన సవిత కవిత సంకలనం ఆవిష్కరణ చేయనున్నారు. ఈ సందర్భంగా వైభవంగా జరిగే సాహిత్యోత్సవాలలో కవులు, రచయితలు, నగర ప్రజలు , సాహిత్యఅభిమానులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

పసుపు.. పరుగు

మార్కెట్‌లో పంట ధరకు రెక్కలు

- క్వింటాల్‌కు రూ.12వేల పైనే..
- దాచుకున్న వారికే 'పచ్చ' బంగారం
- ఆనందంలో అన్నదాతలు

పచ్చ బంగారం పసుపు ధర పరుగులు పెడుతోంది. నెలరోజుల నుంచి వ్యవసాయ మార్కెట్‌లలో జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తోంది. రికార్డు స్థాయిలో క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.12వేలకు పైగా పలుకుతోంది. దీంతో ఇన్నిరోజులు దాచుకుని నిరీక్షిస్తున్న రైతులకు బంగారంగా మారడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


కేసముద్రం మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన పసుపు పంట

కేసముద్రం : కొన్నేళ్లుగా మార్కెట్‌లో పసుపుకు సరైన ధర లేక రైతులు నిరాశ చెందుతూ వచ్చారు. ఓ పక్క సరైన ధర, దిగుబడి లేక.. మరోవైపు పెట్టుబడులు లేక.. పసుపు రైతులు ఇతర పంటల సాగుపై దృష్టిసారించారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పసుపు సాగు విస్తీర్ణం అమాంతం పడిపోయింది. మార్కెట్‌లో పసుపు సీజన్ చివరి దశలో ధర ఒక్కసారిగా పెరుగుతూ క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.12వేలకు పైగా పలుకుతోంది. దీంతో ఇన్నిరోజులు దాచుకుని నిరీక్షిస్తున్న రైతులకు బంగారంగా మారింది. ఇదిలా ఉండగా ఇప్పటికే 95 శాతం మంది రైతులు ఎప్పటిలాగే ధర పెరగదనే ఉద్దేశంతో మార్కెట్‌లో తక్కువ ధర రూ.5 నుంచి రూ.6వేల వరకు అమ్ముకుని నష్టపోయారు. మిగతా రైతులు గిట్టుబాటు ధర కోసం ఎదురుచూస్తూ పసుపును దాచుకున్నారు. మరికొందరు రైతులు ధర కోసం ఏకంగా నాలుగేళ్లకు పైగా పసుపు శీతలగోదాంలో, ఇళ్లల్లో భద్రపరుచుకున్నారు. ఈ క్రమంలో నెలరోజులుగా వ్యవసాయ మార్కెట్‌లలో పసుపు ధరలకు రెక్కలొస్తున్నాయి. ఈ మేరకు కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం క్వింటాల్ పసుపు కాడిరకానికి గరిష్ట ధర రూ.12 వేలు దాటింది. ఇక్కడి మార్కెట్‌లో ఈ యేడాది మార్చి నుంచి పసుపు సీజన్ ప్రారంభం కాగా, మొదట్లో క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.5 నుంచి రూ.6వేల వరకు పలికింది. ఈ క్రమంలో నెలరోజుల క్రితం ఈ మార్కెట్‌లో క్వింటాకు గరిష్ట ధర రూ.10 వేలకు చేరింది. ఆ తర్వాత రోజురోజుకూ ధర పెరుగుతూ గరిష్ట ధర రూ.12వేలకు పైగా పలుకుతోంది.

పసుపుకు బదులు ఇతర పంటలు..

మరోవైపు.. ఇక ధర పెరగదనే ఉద్దేశంతో పలువురు రైతులు తక్కువ ధరకు అమ్ముకోవడంతోపాటు పసుపు పంటకు బదులు ఇతర పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పసుపు ధర పరుగులు పెడుతుండడంతో వారు అయోమయానికి గురవుతున్నారు. కాగా పసుపు సాగులో రాష్ట్రంలోనే కేసముద్రం మండలానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. 2015 వరకు కేసముద్రంలో 6 వేల ఎకరాలకు పైగా పసుపు సాగు విస్తీర్ణం ఉండగా, ఆ తర్వాత పసుపుకు ధరలేక, మరోవైపు దిగుబడులు రాకపోవడంతో క్రమక్రమంగా పంట విస్తీర్ణం తగ్గుతూ వచ్చింది. ఈ మేరకు ఈ వానాకాలం కేవలం 150 ఎకరాల్లో మాత్రమే పసుపు పంట సాగు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇక మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 1000 ఎకరాల వరకు పసుపు సాగు చేయనున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఇదే రీతిలో రాష్ట్ర వ్యాప్తంగా పసుపు సాగు చేసే ప్రాంతాల్లో విస్తీర్ణం అమాంతం తగ్గిపోయింది.

కేసముద్రం మార్కెట్‌కు వచ్చిన పసుపు, ధర వివరాలు

సంవత్సరం	క్వింటాళ్లు	గరిష్ట ధర	కనిష్ట ధర
1)2018–19	85,378	రూ.7,713	రూ.4,000
2)2019–20	1,22,931	రూ.6,659	రూ.3,109
3)2020–21	9,7083	రూ.8,081	రూ.3,011
4)2021–22	62,646	రూ.7,811	రూ.2,952
5)2022–23	54,845	రూ.11,352	రూ.7,801

క్వింటాల్ పసుపు రూ.5,500కే అమ్ముకున్నా..



గతంలో 2 ఎకరాల్లో పసుపు పంట సాగు చేసేది. కానీ ధర లేకపోవడంతో ఈ యేడాది ఎకరం భూమిలో సాగు వేశా. పంటకు తెగుళ్లు సోకడంతో కేవలం 2.60 క్వింటాళ్లు మాత్రమే చేతికి వచ్చింది. మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.5,500కే ఖరీదు చేశారు. ఎలాగు ధర పెరగదనే ఉద్దేశంతో తక్కువ రేటుకే అమ్ముకున్నా. ఎలాగు పసుపు రేటు పెరగదని విత్తనం పసుపు కూడా అమ్మిన. ఈసారి అరెకరంలోనే సాగు చేస్తున్నా. ఇప్పుడు మార్కెట్‌లో పసుపుకు ఒక్కసారిగా ధర పెరుగుతాంది. పంట వేద్దామంటే అదునుదాటింది.

-సామ ప్రభాకర్, రైతు, అమీనాపురం

దాచుకోవడమే కలిసొచ్చింది



కొన్నేళ్లుగా పసుపు పంట సాగు చేస్తున్నా. కానీ మార్కెట్‌లో ధర పెరగకపోవడంతో నిరాశ చెందా. 3 ఎకరాల్లో పసుపు సాగు చేస్తే 50 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అలా రెండేళ్లపాటు పండిస్తే, చేతికివచ్చిన 100 క్వింటాళ్ల పసుపును ఇంట్లోనే దాచిపెట్టా. మార్కెట్‌లో ధర లేకపోవడంతో దాదాపు నాలుగేళ్లపాటు అలాగే ఉంచా. అలా దాచుకోవడమే నాకు కలిసొచ్చింది. ఒక్కసారిగా పసుపు ధర రూ.12వేలు దాటడంతో సంతోషం కలిగించింది.

-కాటం రాంరెడ్డి, రైతు కేసముద్రంవిలేజ్

క్వింటాల్ పసుపునకు రూ.12,213



ఈ ఏడాది ఎకరంన్నర భూమిలో పసుపు పంట సాగు చేశా. మొత్తం 30 కింటాళ్లకు పైగా చేతికివచ్చింది. గతేడాది క్వింటాల్ పసుపు రూ.6వేలకే అమ్ముకుని నష్టపోయినా. అందుకే ఈసారి అమ్ముకోవద్దనుకుని ఇంట్లోనే దాచుకున్నా. కొద్దిరోజులుగా పసుపు రేటు పెరుగుతాందని తెలిసి గురువారం 40 కింటాళ్ల పసుపును కేసముద్రం మార్కెట్‌కు తీసుకువచ్చా. నేను తెచ్చిన కాడిరకం పసుపుకు రూ.12,213 ధర పలికింది. ముందుజాగ్రత్తతో దాచుకోవడం వల్లే ధర కలిసొచ్చింది. ఇన్నేళ్ల తర్వాత ధర పెరగడం ఆనందంగా ఉంది.

-గుగులోతు శంకర్, రైతు, పీన్యాతండా, మదనతుర్తి, నెల్లికుదురు మండలం

టీచర్ల పెండింగ్ బిల్లులు చెల్లించాలి...

- టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్


మాట్లాడుతున్న భోగేశ్వర్

విద్యారణ్యపురి : టీచర్ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హనుమకొండలో నిర్వహించిన టీపీటీఎఫ్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్‌చేస్తూ ఈనెల 5న టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో హనుమకొండ జెడ్పీ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టబోతున్నామన్నారు. ఈకార్యక్రమాన్ని ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 2006–2007 నుంచి 2021–2022 వరకు జెడ్పీజీపీఎఫ్‌కు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ. 2,741.82 కోట్ల వడ్డీ బకాయి వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జెడ్పీజీపీఎఫ్ ఖాతాల్లో మిస్సింగ్ క్రెడిట్ ఉన్న సుమారు రూ. 1000 కోట్లు సరి చేసి ఉపాధ్యాయుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. సమావేశంలో ఉపాధ్యాయ దర్శిని సంపాదకుడు వి అజయ్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు జె స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్, పూర్వ ఉమ్మడి వరంగల్ జిల్లా జనరల్ సెక్రటరీ ఉట్కూరు అశోక్, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు బి పూర్ణచందర్, డి రమేష్, దినేష్, కిష్టయ్య, కనకస్వామి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడితే అత్యుత్తమ ఫలితాలు

- ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎ. వరదారెడ్డి

హసన్‌పర్తి: కష్టపడితే అత్యుత్తమ ఫలితాలు సాధించొచ్చని ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి అన్నారు. ఎస్సార్ యూనివర్సిటీ బి.టెక్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు గువారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సమావేశానికి వరదారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రయోజనాల కోసం భారతదేశ ప్రతిభను అభివృద్ధి చేయడానికి సార్వత్రిక నాణ్యమైన విద్య ఉత్తమ మార్గమన్నారు. సాంకేతిక సంబంధిత సామాజిక స్పృహ కలిగిన భావితరాన్ని తయారు చేసేందుకు ఎస్సార్ యూనివర్సిటీ కృషి చేస్తోందన్నారు. యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ మార్పులకనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు రోజూ ఒక కొత్త విషయం నేర్చుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి మాట్లాడుతూ 21వ శతాబ్దపు ప్రపంచీకరణ ప్రపంచంలో సరిపోయ్యేలా పాఠ్యప్రణాళిక మార్పులను తీసుకొచ్చినట్లు వివరించారు. దీని అమలు వల్ల విద్యార్థులను అధిక వేతన ప్యాకేజీలతో మంచి కంపెనీల్లో పనిచేయడానికి వీలు కలుగుతుందన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

- భర్త ఇంటి ఎదుట భార్య ఆందోళన
- ఏసిరెడ్డినగర్‌లో ఘటన


ఆందోళన చేస్తున్న భార్య పల్లవి

కాశిబుగ్గ: అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తూ విడాకులు ఇవ్వమంటున్నాడని భార్య.. భర్త ఇంటి ఎదుట ఆందోళన చేపట్టింది. ఈ ఘటన గురువారం 35వ డివిజన్ ఏసిరెడ్డినగర్‌లో జరిగింది. బాధితురాలు పల్లవి కథనం ప్రకారం ఏసిరెడ్డినగర్‌కు చెందిన దండి పరమేష్‌తో 2011లో పల్లవికి పెళ్లి జరిగింది. పెళ్లి సమయంలో రూ. 2 లక్షలు, 4 తులాల బంగారం, 20 తులాల వెండి కట్నంగా ముట్టజెప్పారు. కాపురం కొన్నాళ్లు బాగానే సాగింది. వీరికి ఇద్దరు పిల్లలు జన్మించారు. తరువాత అదనపు కట్నం కోసం భర్త పరమేష్ వేధించసాగాడు. ఈ విషయం తెలిసిన పల్లవి తల్లిదండ్రులు పెద్ద మనుషులతో పంచాయితీ నిర్వహించగా రమేష్ తన తప్పు ఒప్పుకుని భార్యను కాపురానికి తీసుకెళ్లాడు. మళ్లీ గత జూన్ 17న అకారణంగా కొట్టాడు. దీంతో పల్లవి మహిళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు కౌన్సెలింగ్ నిర్వహించి ఇంటికి పంపారు. జూన్ 29న రాత్రి మళ్లీ అకారణంగా గొడవకు దిగి విడాకులు ఇవ్వమని తీవ్రంగా కొట్టాడు. దీనికి అత్తగా కూడా వత్తాసు పలుకుతోందని, దాడిలో తన చేయి విరగడంతో ఎంజీఎంలో చికిత్స చేయించుకున్నాని పల్లవి వాపోయింది. భర్త నుంచి తనకు న్యాయం చేయాలని, పిల్లలు కావాలని ఆమె వేడుకుంటోంది.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి

- ఇస్రో మాజీ సీనియర్ సైంటిస్ట్ కంజిలాల్


మాట్లాడుతున్న కంజిలాల్

హన్మకొండ అర్బన్: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ఇస్రో మాజీ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ అపూర్వ కంజిలాల్ అన్నారు. గురువారం నగరంలోని పింగిళి ప్రభుత్వ మహిళ కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రమౌళి అధ్యక్షతన కళాశాల భౌతిక శాస్త్ర విభాగం, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో 'చంద్రుడిపై భారతదేశ యాత్ర చంద్రయాన్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కంజిలాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం అన్ని సబ్జెక్టుల విద్యార్థులకు అవసరమన్నారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే విద్యార్థులకు సైన్స్‌పై కనీస అవగాహన ఉండాలన్నారు. జూలై 14 శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించిన చంద్రయాన్ –3 ఆగస్టు 23న రోవర్ చంద్రుడిపై ల్యాండ్ అవకాశం ఉందని తెలిపారు. చంద్రయాన్ –3 ముఖ్య లక్ష్యాలు చంద్రుడి కూర్పు అర్థం చేసుకోవడం, చంద్రుడి ఉపరితలంపై లభ్యమయ్యే రసాయనాలు, సహజ మూలకాలు, నేల, నీరు తదితర అంశాలపై అక్కడే శాస్త్రీయ ప్రయోగాలు, పరిశీలనలు చేయడమన్నారు. ఈ సందర్భంగా భారతదేశ అంతరిక్ష తొలి ప్రస్థానం నుంచి నేటి వరకు జరిగిన పరిణామాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.సుహాసిని, పరీక్షల నియంత్రణాధికారి డి.రామకృష్ణారెడ్డి, అకడామిక్ కోఆర్డినేటర్ డి.పార్వతి, భౌతిక శాస్త్ర విభాగాధిపతి సీహెచ్ స్నేహలతారెడ్డి, విభాగ అధ్యాపకురాలు ఎస్.కిరణ్మయి, తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల నిర్వహణపై అధ్యయనానికి కమిటీ

- ఉత్తర్వులు జారీ చేసిన కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని హాస్టళ్లు, మెస్‌ల నిర్వహణపై అధ్యయానికి 12 మంది అధ్యాపకులతో కూడిన కమిటీని నియమిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య టి శ్రీనివాస్‌రావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ అధ్యయన కమిటీకి చైర్మన్‌గా సోషల్ సైన్స్ డీన్, కేయూ పాలక మండలి సభ్యుడు ఆచార్య టి మనోహర్, సభ్యులుగా సైన్స్ డీన్, పాలకమండలి సభ్యులుగా ఆచార్య పి మల్లారెడ్డి, కేయూ అకాడమిక్ ఆడిట్ డీన్ ఆచార్య జి షమిత, యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సి పాల్ ఆచార్య బి సురేష్‌లాల్, ఫార్మసీ కళా శాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎన్ ప్రసాద్, కేయూ అభివృద్ధి అధికారి ఆచార్య ఎన్ వాసుదేవరెడ్డి, కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ఆచార్య వై వెంకయ్య, కేయూ ఫైనాన్స్ ఆఫీసర్ తోటరాజయ్య, జగ్జీవన్ రామ్ హాస్టల్ జా యింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ రాజ్‌కుమార్, గణపతిదేవ హాస్టల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శ్రీను, పోతన హాస్టల్ జాయింట్‌డైరెక్టర్ డాక్టర్ జి కృష్ణయ్య ఉన్నారు. ఈ కమిటీకి మెంబర్ కన్వీనర్‌గా కేయూ హాస్టళ్ల అదనపు డైరెక్టర్ డాక్టర్ బి సుచరితపాల్ వ్యవహరిస్తారు. యూనివర్సిటీల్లోని అన్ని హాస్టళ్లు, మెస్‌ల నిర్వహణలో కొనుగోళ్లు, తదితర సమస్యలను లోతుగా అధ్యయనం చేయాలని ఆదేశించారు.

ప్రిన్సిపాళ్లు, హాస్టళ్ల జాయింట్ డైరెక్టర్లతో వీసీ సమావేశం

కాకతీయ యూనివర్సిటీలోని అకడామిక్ కమిటీ హాల్‌లో ఈనెల 2న వీసీ ఆచార్య తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ ఆచార్య టి శ్రీనివాస్‌రావు.. యూనివర్సిటీలోని వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, హాస్టళ్ల డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్లు, కేర్‌టేకర్లతో సమావేశం నిర్వహించారు. యూనివర్సిటీలోని 12 హాస్టళ్లు, నాలుగు మెస్‌ల నిర్వహణ ,ఖర్చుల విషయంలో వీసీ రమేష్ వారితో చర్చించి పలు సూచనలు చేశారు.

అర్హత ఉన్న డ్రైవర్లను నియమించాలి

- డ్రైవర్, క్లీనర్ అసోసియేషన్ ప్రతినిధి బండి భాస్కర్

ఖిలా వరంగల్: హెవీ లైసెన్స్, 3 ఏళ్ల అనుభవం ఉన్న అర్హులైన డ్రైవర్లనే ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు నియమించుకోవాలని ప్రైవేట్ విద్యా సంస్థల బస్సుల డ్రైవర్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి బండి భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీఏ నిబంధనలను యాజమాన్యాలు, అధికారులు వదిలేయడం దురదృష్టకరమన్నారు. అర్హతలేని డ్రైవర్ల నియామకం వల్లే ప్రమాదాల జరుగుతున్నాయని, శిక్షణ తరగతులను నిర్వహించడంలో ఆర్టీఏ అధికారులు విఫలమయ్యారని చెప్పారు. ప్రైవేట్ విద్యా సంస్థల బస్సుల ఓనర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె స్వరూప్ రెడ్డి ఆధ్వర్యంలో డీటీసీ, ఎంవీఐ స్థాయి అధికారుల నేతృత్వంలో 2019 విద్యా సంవత్సరం వరకు డ్రైవర్లు, క్లీనర్లకు తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్, గణపతి ఇంజనీరింగ్, వాగ్దేవి ఇంజనీరింగ్, జేఎస్ఎం స్కూల్ ప్రాంగణాల్లో శిక్షణ తరగతులు నిర్వహించారని గుర్తు చేశారు. శిక్షణ తరగతులతో డ్రైవర్లల్లో అవగాహన పెరిగి ప్రమాదాల సంఖ్య పూర్తిగా తగ్గిందని తెలిపారు. వేతనం ఎక్కువగా ఇవ్వాల్సి వస్తోందని సీనియర్ బస్సు డ్రైవర్లను పక్కన పెట్టి స్కూల్ యాజమాన్యాలు అవమానిస్తున్నాయన్నారు. అనుభవం లేని డ్రైవర్ల నియామకం , ఆర్టీఏకు ముందు చూపులేక ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా ఆర్టీఏ అధికారులు స్పందించి డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆయన కోరారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్

- 8 బైక్‌లు స్వాధీనం
- నిందితుడు మైనర్


స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపుతున్న ఏసీపీ

కమలాపూర్: ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న కమలాపూర్ మండలం గూడూరుకు చెందిన ఓ దొంగ (15)ను అరెస్ట్ చేసి నిందితుడి వద్ద నుంచి ఎనిమిది బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు కాజీపేట ఏసీపీ పి.డేవిడ్‌రాజ్ తెలిపారు. కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కమలాపూర్ మండలం గూడూరు క్రాస్ రోడ్డులో గురువారం ఇన్‌స్పెక్టర్ సంజీవ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టగా గూడూరుకు చెందిన ఓ బాలుడు (15) అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడు. అనుమానం వచ్చిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడని తెలిపారు. నిందితుడి వద్ద నుంచి నాలుగు టీవీఎస్ ఎక్సెల్, ఒక గ్లామర్, ఒక స్ప్లెండర్ ప్లస్, ఒక హీరోహోండా, ఒక సీడీ డాన్, తదితర ఎనిమిది ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని బాల నేరస్తుడిని జువైనల్ కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. కాగా, ద్విచక్రవాహనాల చోరీ కేసును చేధించడంలో ప్రతిభ కనబర్చిన ఎస్సైలు చరణ్, సతీష్, సిబ్బంది సురేందర్, ప్రసన్నకుమార్‌ను ఏసీపీ అభినందించడంతో పాటు రివార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సంజీవ్, ఎస్సై సీమా ఫర్హీన్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి


వెంకట్రాంనర్సయ్య (ఫైల్)

గూడూరు: మండలంలోని మర్రిమిట్ట శివారు రాళ్లవాగు సమీపంలోని ఎన్‌హెచ్‌పై ఓ ఎద్దుల బండిని ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో ప్రభుత్వ తెలుగు పండిట్ అక్కడికక్కడే మృతి చెందాడు. మండల కేంద్రంలోని చెంద్రుగూడేనికి చెందిన మంతెన వెంకట్రాంనర్సయ్య (50) మచ్చర్ల ప్రాథమిక పాఠశాలలో తెలుగు పండిట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. పని నిమిత్తం బైక్‌పై గురువారం ఉదయం నర్సంపేటకు వెళ్లి తిరిగి గూడూరుకు వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా ఆగి ఉన్న ఎద్దుల బండిని ఢీకొన్నాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, బాల్యమిత్రులు, బంధువులు బోరున విలపిస్తూ ఘటనా స్థలికి చేరుకున్నారు. వెంకట్రాంనర్సయ్య మృతితో చెంద్రుగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, మృతుడికి భార్య స్వరూప, కూతురు, కుమారుడు ఉన్నారు.